వనభోజనాలకు వెళ్లిన పెద్దపల్లి వాసులు

నవతెలంగాణ-రాజంపేట్

గత 20 రోజులుగా వర్షాలు పడకపోవడంతో రైతులు వేసిన మొక్కజొన్న, పత్తి ఎండలకు పూర్తిగా వాడుచూపుతున్నాయి. దీనితో గ్రామస్తులంతా కలుపుకొని ఆదివారం గ్రామ శివారులో వన భోజనానికి వెళ్లారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో సమృద్ధిగా వర్షం పడాలని పంటలు బాగా పండి అందరు బాగుండాలని ప్రత్యేక పూజలు చేసినట్టు తెలిపారు.



వ్యవసాయ క్షేత్రాల్లో చెట్ల కింద వనభోజనాలు

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

1

సోమవారం 14 ఆగస్టు 2023

నూతన ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ హనుమంత్ రెడ్డి, వైస్ చైర్మన్ పురం రాజమౌళి, డైరెక్టర్ రాకేష్ రెడ్డిలు పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బిఆర్ఎస్ మండల మహిళ అధ్యక్షురాలు దేవరలక్ష్మీ శాలువాతో ఘనంగా సన్మానించారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బొంద్ల అంజయ్య, లలిత, తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ కమిటీ సభ్యులకు సన్మానం

20 ఏండ్లుగా ఎదురుచూపులే

గాంధారిలో డిగ్రీ కాలేజీ ఏర్పాటుపై ప్రకటన వచ్చేనా..?

- పాలకులు మారినా నెరవేరనిహామీ
- ఉన్నత విద్యకు దూరమవుతున్న పేదలు, బాలికలు
- నేడు ఎల్లారెడ్డిలో మంత్రి కేటీఆర్ పర్యటన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

నవతెలంగాణ-గాంధారి

కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని గత 20 సంవత్సరాలుగా వివిధ రాజకీయ పార్టీలు అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో హామీలు ఇస్తూ ఎన్నికల అయిపోగానే హామీని విస్మరిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు సైతం డిగ్రీ కాలేజీ కోసం పోరాటాలు చేసిన సందర్భాలు తక్కువే. అధికార పార్టీ పట్టింపు అంతంతే.. ఫలితంగా విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. నేడు ఎల్లారెడ్డిలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో డిగ్రీ కాలేజీ మంజూరు చేసేనా అని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో గాంధారి మండలం.. మారుమూల వెనుకబడిన ప్రాంతం. గాంధారి మండలం నుంచి సుమారుగా 500 మంది విద్యార్థులు ప్రతిరోజు డిగ్రీ విద్యను అభ్యసించడం కోసం కామారెడ్డి, నిజామాబాద్, బాన్సువాడ తదితర ప్రాంతాలకు వ్యయప్రయాసాలకోర్చి వెళ్లి వస్తున్నారు. ఆర్థిక స్తోమత అంతతగా ఉన్న వారు దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇంటర్‌తోనే చదువును ఆపేస్తున్నారు. ముఖ్యంగా బాలికలు దూర ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నారు. దీంతో వారి చదువు ఇంటర్‌తోనే ముగుస్తుంది.

ఆడపిల్లలను తల్లిదండ్రులు డిగ్రీ విద్య కోసం కామారెడ్డి, నిజామాబాద్ బాన్సువాడ ప్రాంతాలకు పంపే పరిస్థితి లేకపోవడంతో ఆడపిల్లలు డిగ్రీ విద్యకు దూరమవుతున్నారు. కాస్త కూసో ఆర్థికంగా ఉన్నవారు కామారెడ్డి, బాన్సువాడ, నిజామాబాద్ ప్రాంతాల్లో రూములు అద్దెకి తీసుకొని, హాస్టల్లో ఉంటూ డిగ్రీ విద్య చదువుకుంటున్నారు. పాలకుల నిర్లక్ష్యంతో గాంధారి మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులు డిగ్రీ విద్యకు దూరమవుతున్న పాలక పక్షాలు ప్రతిపక్షాలు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలోకి రాకుముందు హామీ ఇచ్చి విస్మరించగా, 9 ఏళ్లగా బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగుతున్నా గాంధారి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు

గాంధారి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ, పి డి ఎస్ యు, ఏబీవీపీ, టీజీవిపి, టిఎన్ఎస్ఎఫ్, ఎన్ఐఎస్‌యు వివిధ విద్యార్థి సంఘాలు జేఏసీగా ఏర్పడి డిగ్రీ కళాశాల సాధన సమితి పేరుతో ఉద్యమాలు చేపట్టారు. ఎమ్మెల్యేలు మొదలుకొని మంత్రులు రాష్ట్ర స్థాయి నాయకులకు చివరికి అసెంబ్లీలో ప్రస్తావించినా గాంధారిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుపై పాలకులు పట్టించుకోవడం లేదు.

మంత్రి కేటీఆర్ నెరవేర్చేనా..?

నేడు ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో విద్యార్థుల విద్యార్థి సంఘాల నాయకులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏండ్లుగా ఉన్న డిగ్రీ కాలేజీ ఏర్పాటుపై మంత్రి కేటీఆర్ స్పందించి మంజూరు చేయాలని కోరుతున్నారు.

పక్కూరికి వెళ్లడమే కష్టంగా ఉంది..

నేనవత్ మౌనిక. దుర్గం. జెమినితండా



గాంధారి మండల కేంద్రం నుంచి దుర్గం గ్రామపంచాయతీకి పది కిలోమీటర్ల దూరం. దుర్గం నుండి గాంధారికి వెళ్లి చదువుకోవడమే గగనం. అలాంటిది కామారెడ్డికి వెళ్లి డిగ్రీ చదువుకోవడం అంటే మాలాంటి మధ్యతరగతి విద్యార్థులకు సాధ్యం కాని పని. ఆర్థిక స్తోమత అంతంతే ఉండడంతో కామారెడ్డికి వెళ్లి చదువుకునే స్తోమత లేకపోవడంతో ఇంటర్ తోనే మా తల్లిదండ్రులు చదువు మాన్పించేశారు.

డిగ్రీకాలేజీ ఏర్పాటులో నిర్లక్ష్యం వీడాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అజయ్‌కుమార్



గాంధారి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటులో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి. ఇక్కడ డిగ్రీ కాలేజీ ఏర్పాటు కోసం ఎస్ఎఫ్ఐతో పాటు విద్యార్థి సంఘాలు ఎన్నో పోరాటాలు ఎన్నో ఉద్యమాలు చేశాయి. కానీ ఇప్పటివరకు స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదు. తెలంగాణ ప్రభుత్వం వస్తే విద్యార్థులకు కేజీ టు పీజీ ఉచిత విద్యా అని చెప్పి.. ప్రస్తుతం పేదవారిని ఉన్నత విద్యకు దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారు. మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో ఇప్పటికైనా విద్యార్థుల ఆవేదన తెలుసుకొని గాంధారి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుంది.

గాంధాలు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి

ఏబీవీపీ జిల్లా నాయకుడు సుమన్



గాంధారి మండల కేంద్రం నుంచి విద్యార్థులు డిగ్రీ విద్య కోసం కామారెడ్డి బాన్సువాడ నిజామాబాద్ తదితర దూర ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తుంది. దీంతో చాలామంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

నేడు కేటీఆర్ పర్యటన

- కామారెడ్డి జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఎల్లారెడ్డిలో బహిరంగ సభ



ముస్తాబయిన సభా ప్రాంగణం

నవతెలంగాణ-కామారెడ్డి/ఎల్లారెడ్డి

కామారెడ్డి జిల్లాలో నేడు(సోమవారం) ఐటీ,మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించనున్నారు. ముందుగా కామారెడ్డి పట్టణంలోకి వెళ్లే బైపాస్ వద్ద స్వాగత తోరణాన్ని ప్రారంభించనున్నారు. 44వ జాతీయ రహదారి నుంచి సెంట్రల్ లైటింగ్‌ను, రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించనున్నారు. అనంతరం తాడ్వాయి మండల కేంద్రంలో స్పోర్ట్ స్టేడియం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

తదనంతరం ఎల్లారెడ్డి మున్సిపల్ కేంద్రంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. నూతన బస్టాండ్‌తో పాటు వెజ్ అండ్ నాన్‌వేజ్ మార్కెట్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేయనున్నారు. చిల్డ్రన్‌పార్క్ సైతం ప్రారంభించనున్నారు. తదనంతరం ఎల్లారెడ్డిలో ఏర్పాటు చేసన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల

- నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం

నవతెలంగాణ-నిజామాబాద్

ఎస్సారెస్పీ నుంచి పలు కాలువలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం 3200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. వివిధ కాలువలకు 6995 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ నీటిమట్టం నిలకడగా ఉంది. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.3 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1090.2 అడుగుల(85.360 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 1089.1 అడుగుల(80.140 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి 110.663 టీఎంసీల నీరు వచ్చి చేరగా.. 46.140 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. ఇటీవల వర్షాలు కురవకపోవడంతో ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది.

ఉచితంగా సినిమా ప్రదర్శన

- ఏర్పాట్లు చేయండి : కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదేశం



సెల్‌ఫోన్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-తాడ్వాయి(కామారెడ్డి)

విద్యార్థులలో, వారి తల్లిదండ్రులతో పాటు ప్రజలకు జాతీయ భావం పెంపొందేలా జాతిపిత మహాత్మా గాంధీ చిత్ర ప్రదర్శనను జిల్లాలోని సినిమా హాళ్లల్లో ఉచితంగా ప్రదర్శించనున్నట్టు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. విద్యార్థులు తిలకించే విధంగా చక్కటి ప్రణాళిక రూపొందించుకోవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మండల విద్యాధికారులు, తహసీల్దార్లు, రవాణా శాఖాధికారులకు సూచించారు. ఆదివారం అధికారులతో ఏర్పాటు చేసిన టెలి కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 14 నుండి 24 వరకు జాతిపిత మహాత్మా గాంధీ చిత్ర ప్రదర్శన చేపట్టనున్నట్టు తెలిపారు. గత స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా నిర్వహించిన మాదిరే విద్య,రెవిన్యూ, రవాణా, పొలిసు శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయవలసినదిగా సూచించారు. 14 వ తేదీన ఉదయం 8 నుండి 11.30 గంటల వరకు, 16 నుండి 24వ తేదీ వరకు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1.30 గంటలకు వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని అన్నారు. కాగా 15వ తేదీన స్వాతంత్ర దినోత్సవం, 20న ఆదివారం కారణంగా చిత్ర ప్రదర్శన ఉండదని కలెక్టర్ పేర్కొన్నారు. సినిమా హాళ్ల సీటింగ్ సామర్థ్యం మేరకు ఏ రోజు ఏ పాఠశాల విద్యార్థులను సమీప థియేటర్లకు తీసుకెళ్ళలో ప్రణాళిక రూపొందించుకొని విద్యార్థులను థియేటర్ ల వద్దకు తీసుకెళ్ళి సినిమా ప్రదర్శన అనంతరం వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసుకోవలసిందిగా కలెక్టర్ అధికారులకు సూచించారు. తహసీల్దార్లు సినిమా యాజమాన్యాలతో మాట్లాడి స్క్రీనింగ్ జరిగేలా చూడాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం కోసం అహింసా మార్గంలో నిరంతర పోరాటం చేసిన జాతిపిత మహాత్మాగాంధీ జీవిత చరిత్రను తెలియజేసే చిత్రాన్ని విద్యార్థులు వీక్షించి జాతీయ భావాన్ని చాటే విధంగా చూడాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో ఆర్.టి.ఓ. వాణి , ఇంచార్జి డీఈఓ ఉమారాణి, తహసీల్దార్లు, ఎంఈఓ లు, ఎంపిఐ లు పాల్గొన్నారు.

అప్పుడెట్లుండే.. ఇప్పుడెట్లయింది

- తెలంగాణను తలెత్తుకునేలా చేసిన వ్యక్తి కేసీఆర్
- కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలు నమ్మి మోసపోవద్దు
- కోనాపూర్ సభలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- రూ.23 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మంత్రి వేములపై పూలుజల్లుతూ స్వాగతం పలుకుతున్న స్థానికులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్రం కేసీఆర్ రాక ముందు ఎట్లుండే....కేసీఆర్ వచ్చిన తర్వాత ఎట్లాయిందనేది కాపు రైతన్నలు ఆలోచన చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలు గృహ నిర్మాణ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉండేదని.. తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో గుండె మీద చేయి వేసుకొని రైతులు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. దేశంలో తెలంగాణను తలెత్తుకునేలా చేసిన వ్యక్తి కేసిఆర్ అన్నారు. ఆదివారం మండలంలోని అమీర్ నగర్, కోనాపూర్ గ్రామాల్లో రూ. 23 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.

తెలంగాణ అంతా ఒక్క కుటుంబమని, కేసీఆర్ ఆ కుటుంబానికి తండ్రిలాంటి వ్యక్తి అన్నారు. ఇంటికి ఏమి కావాలో ఇంటి పెద్దకు మాత్రమే తెలుసని, తెలంగాణ ప్రజలకు ఏమీ కావాలో తెలిసిన వ్యక్తి కేసిఆర్ మాత్రమేనన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్కొక్కటిగా బాగు చేసుకుంటూ పోతూ, దేశం ముందట తెలంగాణను తలెత్తుకునేలా చేసిన వ్యక్తి కేసిఆర్ అని కొనియాడారు. సంక్రాంతికి గంగిరెద్దుల వేషం వేసుకుని వచ్చినట్లు కొందరు ఎన్నికలు రాంగానే ఊర్ల మీద వచ్చి పడుతున్నారన్నారు. రైతును అరిగోస పెట్టిన కాంగ్రెస్ వాళ్లు రైతు ధర్నా చేస్తున్నారని.. ధరలు పెంచి పేదల కడుపు కొడుతున్న బిజెపి వాళ్లు పేదల కోసం ధర్నా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రైతులకు 3గంటల కరెంట్ చాలు అంటున్నాడని, కేంద్రంలో ఉన్న బీజేపీ పార్టీ రైతుల మోటార్లకు మీటర్లు పెడతామంటు న్నదని తెలిపారు. కాంగ్రెస్, బిజెపి వాళ్లు రైతుల,పేదల బాగు కోరుతారంటే మనం నమ్ముదామా? అని ప్రజలను ప్రశ్నించారు. కాంగ్రెస్,బీజేపీ నేతల మాటలు నమ్మిమోసపోతే.. మళ్ళీ గోస పడతామని, పాత రోజులే పునరావృతం అవుతాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పసుపు బోర్డు పేరుతో బాండ్ పేపర్ రాసిచ్చి రైతులకు గుండు చూపెట్టిన అర్వింద్, గెలిపిస్తే 5 రోజుల్లో తెస్తనన్న పసుపుబోర్డు 5 ఏండ్లు అయినా జాడ లేకుండా పోయిందని విమర్శించారు. అర్వింద్ మోసపు మాటలు నమ్మి కవితను ఓడగొట్టుకున్నామని అన్నారు. కేసిఆర్ కంటే ముందు 10 ఏళ్ల అధికారంలో ఉండి ఏమీ చేయని కాంగ్రెస్ వాళ్లు, ఇప్పుడు చేస్తుందంటున్న రేవంత్ రెడ్డి మోసకారని విమర్శించారు. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉండి ఏమీ చేయని అరవింద్ కూడా ఓ మోసకారే అన్నారు.

రూ.23 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

అమీర్ నగర్, కోనాపూర్ గ్రామాలలో రూ.23 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. అమీర్ నగర్ వద్ద రూ.4.50 కోట్లతో బిళ్యానాయక్ తండా నుండి కమ్మర్ పల్లి అప్రోచ్ రోడ్ వరకు సింగిల్ బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించే పనులకు శంకుస్థాపన చేశారు. కొనాపూర్ గ్రామంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.6.20కోట్లతో నర్సాపూర్ నుండి భూషణ్ రావు పేట వయా ఇనాయత్ నగర్, కొనాపూర్ బీటీ రోడ్డు డబుల్ లైన్ విస్తరణ పనులను, రూ.3.16 కోట్లతో నర్సాపూర్ నుండి భూషణ్ రావు పేట వయా ఇనాయత్ నగర్, కొనాపూర్ బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు, రూ.2.50 కోట్లతో కొనాపూర్ నుండి ఆత్మకూర్ రోడ్ ను నూతనంగా సింగిల్ లైన్ బిటి రోడ్ గా మార్చేందుకు చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు నాయకులు వేముల సురేందర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు గ్రామంలో మంత్రి ర్యాలీ సందర్భంగా యువకులు, గ్రామస్తులు పూలు చల్లుతూ, మహిళలు మంగళ హారతులతో, కోలాటంతో, వల గొడుగుతో ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, ఆర్మూర్ ఆర్డీవో , మార్క్ ఫైడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి, ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి, జడ్పిటిసి సభ్యురాలు పెరుమాండ్ల రాధా రాజాగౌడు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు భాస్కర్ యాదవ్, బద్దం చిన్నారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, సర్పంచ్ దయ్యా దేవయ్య, ఉప సర్పంచ్ తీగల జలంధర్, సింగిల్ విండో చైర్మన్ బడాల రమేష్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పురివిప్పిన నెమలి



పురివిప్పిన నెమలి

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని నాగన్‌పల్లి గ్రామంలో ఆదివారం ఓ ఇంటి సమీపంలోకి వచ్చిన జాతీయ పక్షి నెమలి.. పురివిప్పి నాట్యమాడింది. ఈ దృశ్యం కాలనీవాసులకు కనువిందు చేసింది. సమీపంలోని పంట పొలాల వైపు నెమలీలు సంచరిస్తాయని, పలుమార్లు కాలనీ వైపు వస్తాయని స్థానికులు తెలిపారు. పంట పొలాల నుండి కాలనీలోకి వచ్చిన ఓ నెమలి ఇలా పురివిప్పి నాట్యమాడటాన్ని ప్రత్యక్షంగా చూసిన వారికి కనులవిందు కల్పించింది.

మేదరులను ఆదుకోవాలి



ఎస్ఐ ఉద్యోగం పొందిన యువకుడిని సన్మానిస్తున్న మేదర కులస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్

మేదరులను ఆదుకోవాలని మేదరుల సంఘం జిల్లా అధ్యక్షుడు దర్శనం దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని ఎం.ఆర్.గార్డెన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కేతేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన, బీసీలకు ప్రభుత్వం అందజేసే రూ.లక్ష ఆర్థిక సహాయం పై చర్చించారు. అలాగే భీంగల్ మండలం బాచన్ పల్లి గ్రామానికి చెందిన ప్రణయ్ ఇటీవలే ఎస్సైగా ఎంపిక కావడంతో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని కలిశారు. ఆర్మూర్ సంఘం భవన నిర్మాణానికి, అలాగే డొంకేశ్వర్ మండలంలోని నికాల్ పూర్ సంఘం భవన అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోషాద్రి, ప్రచార కార్యదర్శి దర్శనం గంగాధర్, కోశాధికారి జోరిగే బాలయ్య, సలహాదారులు సుదర్శన్, గంగాధర్, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

'తారు'మారు

నాణ్యత లేక బీటీ రోడ్డుపై గుంతలు

నవతెలంగాణ-సదాశివనగర్



తారుతేలడంతో గుంతలమయంగా రోడ్డు

గాంధారి రోడ్డు నుంచి భూంపల్లి, తుక్కోజివాడి, తిమ్మోజివాడి గ్రామాల మీదుగా 44వ జాతీయ రహదారికి ఏర్పాటు చేసిన లింకు రోడ్డు తారు లేచి గుంతలమయంగా మారుతోంది. నాణ్యత లేకపోవడంతో బీటీ రోడ్డు సర్వీస్.. మున్నాళ్ల ముచ్చటగానే మిగులుతోంది. కోట్లు ఖర్చు ప్రభుత్వం రోడ్లు వేయిస్తే.. వాటి మన్నిక మాత్రం అంతంతగానే ఉంటోందని వాహన దారులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వెరసి రోడ్లపై గుంతలు దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుఒకిన రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

నాణ్యతాలోపంపై ప్రశ్నించినందుకు చెక్‌పవర్ రద్దు

- రామన్నపేట్ ఉపసర్పంచ్ ఆవేదన

నవతెలంగాణ-వేల్పూర్



మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

సీసీ రోడ్డు నాణ్యంగా లేదని ప్రశ్నించినందుకు తన చెక్‌పవర్ రద్దు చేశారని మండలంలోని రామన్నపేట్ ఉప సర్పంచ్ బెల్దర నవీన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2020/2021లో చేసిన సిసి రోడ్ల గ్రావిలింగ్ ఇప్పుడు చేస్తున్నారని తెలిపారు. నాణ్యంగా పనులు చేపట్టకపోవడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేయడంతో తన చెక్‌పవర్ రద్దు చేసినట్టు ఆరోపించారు. పాలకవర్గం మొత్తం ఈ లోపాన్ని గుర్తించి పై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, ఇప్పుడు ఉప సర్పంచ్ అయిన తాను వార్డు సభ్యులతో కలిసి రాజీనామా చేస్తామని మండల ఆఫీసర్ ఎంపీడీవో ఎంపీవోకి రాజీనామా పత్రం అందజేసినట్టు తెలిపారు. దీంతో ఈ కాంట్రాక్టర్లు ప్రభుత్వం నుంచి ఏమైనా ఒత్తిడి వస్తుందేమో అని గ్రహించి సీసీ రోడ్లపై మరమ్మతులు చేపడుతున్నారని తెలిపారు. తన రాజీనామాను ఎంపీడీవో, ఎంపీఓ ఆమోదించలేనందుకు పై అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండలం బస్వాపూర్ గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం అధ్యక్షుడిగా గౌరీ గారి రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు రాంరెడ్డి, కార్యదర్శి యాదవ రెడ్డి, కోశాధికారి అంబారిపేట రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షులు మల్లేష్ మల్లారెడ్డి, సలహాదారులు గౌరీ గారి రాజిరెడ్డి, వెంకన్న గారి బాగారెడ్డి, మల్లేష్ రాజేశ్వర్ రెడ్డి, బాల్ రెడ్డి, గౌరీ గారి మైపాల్ రెడ్డి, అమరావతి సిద్ధరాంరెడ్డి, అలకొండ రాజిరెడ్డి, సావుసాని సిద్ధరాంరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ రెడ్డి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

కుక్కల దాడిలో దూడ మృతి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన సంకర వెంకట రాములకు చెందిన ఆవు దూడపై ఆదివారం కుక్కలు దాడి చేయడంతో మృత్యువాత పడింది. గత వారం క్రితం సైతం కోళ్లను కూడా కుక్కలు దాడిచేసి చంపేశాయని, గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. మృత్యువాత పడిన ఆవు దూడను వైద్యులు కిషోర్ వచ్చి పరిశీలించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన ఖానాపూర్ కులసంఘాల నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్



మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన వడ్డెర కుల సంఘ సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించినారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగిరెడ్డి మోహన్, కుల సంఘాల నాయకులు పల్లపు శ్రావణ్, అంజయ్య, నవీన్, వీడీసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

నిజామాబాద్

2

సోమవారం 14 ఆగస్టు 2023

విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ ఆడుకుంటున్నారు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో సీఎం కేసీఆర్ ఆడుకుంటున్నారని టిడిపి నిజామాబాద్ అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్ విమర్శించారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిజామాబాద్ అర్బన్ లో 28, 35 డివిజన్ జ్యోతినగర్ ప్రాంతంలో పాల్గొని మాట్లాడారు. మీరు వేసే ఓటు కేసీఆర్‌కు చెంప పెట్టులా ఉండాలని అన్నారు. మత్తులో యువత, విద్యార్థి లోకం మునిగిపోతున్నారని, దీనికి కారణం కెసిఆర్ అని మండిపడ్డారు. విద్యా వ్యవస్థ ను నాశనం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కల్లేడ గంగాధర్, శంకర్ ముదిరాజ్, అర్సపల్లి అశోక్, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఫిరోజ్, కుర్లేం శివ, కళిమ్,గౌస్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం.. తానాకుర్తి గ్రామం

- నిధులున్నా పనులు చేపట్టని దుస్థితి
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



గుంతల మయంగా ఉన్న రోడ్డు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తానాకుర్తి గ్రామం గ్రామం పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. వర్షాకాలం వచ్చిందంటే గ్రామానికి వేరే ఊరు వాళ్ళు రావాలంటే భయభ్రాంతులకు గురి కావాల్సి వస్తుంది. గ్రామాభివృద్ధి కోసం రూ. 25లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు వచ్చి ఆరునెలలు కావస్తోంది. కానీ ఇప్పటికీ ఇక్కడ పనులు చేపట్టిన దాఖలాలు లేవు.

గ్రామంలో రోడ్లు ఎంత అధ్వానంగా ఉన్నాయంటే రాత్రి సమయంలో ఎంతోమంది జారిపడిన ఘటనలు ఉన్నాయి. మెయిన్ రోడ్ నుంచి గ్రామ రోడ్డు దాదాపు కిలోమీటర్ గుంతలుగా మారి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో కోతుల బెడద కూడా చాలా ఎక్కువ. నెలరోజుల క్రితం ఇద్దరిపై దాడి చేశాయి. నిజామాబాద్ జిల్లాకు కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామం ఇలా ఉంటే జిల్లాకు మారుమూల ఉన్న గ్రామాల పరిస్థితి ఏ రకంగా ఉంటుందో మరి. గ్రామంలో ఒక ప్రాథమిక పాఠశాల. ఒక అంగన్వాడీ కేంద్రం ఉన్నాయి. అంగన్వాడి కేంద్రం చుట్టూ వాటర్ ఆగి డ్రైనేజీలా తయారవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. అయినా దాన్ని పట్టించుకునే అధికారులు లేకుండా పోయారు. గ్రామపంచాయతీ బిల్డింగ్ వర్షాకాలం వస్తే ఊరుస్తుంది. రూరల్ ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్నా కనీసం ఒక ఆర్టీసీ బస్టాప్ కూడా గ్రామ పరిధిలో లేకపోవడం ఆశ్చర్యకరం. తమకు నిజామాబాద్ జిల్లాకి దగ్గరలో ఉన్న తప్తి తప్ప కనీసం ఒక మొబైల్ ఫోన్ నెట్వర్క్ కూడా సరిగా లేదని,



అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిలిచిన మురుగునీరు

చదువుకునే పిల్లలు నిజామాబాద్‌లో రూములు తీసుకొని ఉండాల్సిన పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. తండాల్లో కూడా నెట్వర్క్ సదుపాయం ఉంటున్న ఈ రోజుల్లో కనీసం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నా కూడా నెట్‌వర్క్ ఉండదు. కనీసం ఈ గ్రామం వంక అధికారులు ఒక్కసారైనా చూడరు. తమ గ్రామంలో ఓట్లు తక్కువగా ఉండటం వల్లనే తమ గ్రామాన్ని పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లుబట్టి ప్రాంగణం పక్కనే స్పోర్ట్స్ ప్రాంగణం నిర్మించారు. కుల సంఘాలకు మంజూరు చేసిన నిధులు ఇప్పటివరకు రాలేదని వాపోతున్నారు. ఒక సంఘం వారు వడ్డీకి డబ్బులు తెచ్చి సంఘాన్ని అభివద్ధి చేశారు. కానీ ఎమ్మెల్యే తన నిధులనుండి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటివరకు నిధులు ఆ సంఘానికి జమ కాలేదని, వడ్డీకి డబ్బులు తెచ్చి సంఘాన్ని అభివద్ధి చేస్తే ఆ వడ్డీకి కూడా సరిపోవటం లేదని ఆ సంఘ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటిక పరిధిలో పిచ్చి మొక్కలు మొలిసి అక్కడికి వెళ్లాలంటే భయపడుతున్నారు. వ్యవసాయ పొలానికి వెళ్లే దారి చూస్తే మాత్రం మాటల్లో వర్ణించలేని స్థితిలో ఉంది. తమ గ్రామంపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎందుకంత చిన్నచూపని గ్రామస్తులు వాపోతున్నారు.

పనులు చేయటానికి ఎవరూ ముందుకు రావడంలేదు..

పంచాయతీ రాజ ఏఈ స్రవంతి

ప్రభుత్వం నిధులు శాంక్షన్ చేసిన మాట నిజమే. సర్పంచికి పది లక్షలు, ఎంపిటిసికి ఐదు లక్షలు, జడ్పిటిసికి 10 లక్షల నిధులు ఉన్నాయి. కానీ పనులు చేయటానికి ఎవరు ముందుకు రావడం లేదు.

నిధులు మంజూరులో జాప్యం

కూచన్‌పల్లి విజయ్



మండలంలోని తానాకుర్తి గ్రామంలో మొటాడిరెడ్డి సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తన ఎస్ డి ఎఫ్ నిధుల నుండి 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఆ డబ్బులు వస్తాయని కమిటీ సభ్యులు బయట నుండి అరువుకు తెచ్చి సంఘ భవనం నిర్మాణం చేపట్టాం. కానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా రాలేదు. బయట నుండి తెచ్చిన అప్పుకి వడ్డీ పెరిగి దాదాపు రెండింతలు అవుతుందని వారు వాపోయారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కానీ సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులు కానీ నిధులను విడుదల చేయాలి.

రోడ్లు, డ్రయినేజీ నిర్మించండి

గ్రామకమిటీ సభ్యులు సాయికుమార్



మోపాల్ మండలంలోని తానాకుర్తి గ్రామంలో. ఎస్.ఆర్.ఇజిఎస్ నిధుల నుండి 25 లక్షల రూపాయలు గ్రామ అభివృద్ధికి మంజూరు చేయడం జరిగింది. కానీ దాదాపు ఆరు నెలలు గడుస్తున్నా పనులకు మోక్షం కలగడంలేదు. ఇప్పటికైనా గ్రామంలో రోడ్లు, డ్రయినేజీ పనులు చేపట్టాలి. తమ గ్రామానికి మెయిన్ రోడ్డు నుంచి లోపలికి వచ్చే రోడ్డు దాదాపు కిలోమీటర్ అస్తవ్యస్తంగా ఉంది. వర్షాకాలంలో బాటసారులకు నరకయాతన తప్పదు. ఎమ్మెల్యే చొరవ చూపి సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలి. గ్రామం జిల్లాకు కూత వేట దూరంలో ఉన్నా కూడా పట్టించుకునే వారు లేరు.

మోపాల్‌లో లైటింగ్ ఏర్పాటు

సొంతడబ్బులతో ఏర్పాటుచేసిన స్థానిక యువత

నవతెలంగాణ-మోపాల్



మండల కేంద్రంలో గల చౌరస్తాలో గత కొన్ని నెలల నుండి పాడైపోయిన సెంటర్ పోల్ లైటింగ్‌ను మోపాల్ గ్రామ యువసేన, యూత్ సభ్యులు తమ సొంత డబ్బులతో పదిహేను వేల రూపాయలను ఖర్చుపెట్టి కొత్త లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. చాలా రోజుల నుండి మోపాల్ సెంటర్ మధ్యలో రాత్రి సమయంలో వాహనదారులకు కానీ అక్కడినుండి నడిచి వెళ్లే వారు చాలా ఇబ్బందికి గురవుతున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన పైసలతో రూపాయి రూపాయి కూడబెట్టి గ్రామానికి ఏదో చేయాలని ఉద్దేశంతో జల్సాలకు పోకుండా మండల కేంద్ర ప్రజలకు కానీ జిల్లా కేంద్ర యువతకు చాలా ఆదర్శంగా నిలిచారు, గ్రామస్తులు కూడా ఆ గ్రామ యువకులు చేసే కార్యక్రమాలను అభినందిస్తున్నారు. కార్యక్రమంలో కిరణ్, రంజిత్,వంశీ, అరవింద్, లక్ష్మణ్, రామ్, రంజిత్, నరేశ్ తదితులు పాల్గొన్నారు.

కరెంట్ పొయ్యి అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దర్పల్లి మండలంలోని దమ్మన్నపేట్ గ్రామానికి చెందిన పౌల్ట్రీ పరిశ్రమ యజమాని సాయిలు తన మనవరాలు పుట్టినరోజు సందర్భంగా డిచ్‌పల్లిలోని మానవతా సదన్‌కు కుటుంబసభ్యులతో రూ.18వేల విలువగల కరెంట్ స్టౌవ్‌ను అందజేశారు. కార్యక్రమంలో రమేష్, రవి, దమ్మన్నాపెట్ సాయిలు కుటుంబ సభ్యులు, కుమార్తె మనవరాలు మానవతా సదన్ కెర్ టేకర్ అందే రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

16న బూత్ కమిటీ సభ్యులతో ముఖాముఖి

నవతెలంగాణ-బోధన్/రెంజల్



ఈనెల 16వ తేదీన ఎడపల్లి మండల కేంద్రంలోని సరయు ఫంక్షన్ హాల్లో బూత్ కమిటీ సభ్యులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, కావున ఈ సమావేశానికి బోధన్ నియోజకవర్గంలోని 5000 మంది బూత్ కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరవుతున్నారని ,కావున పార్టీ నాయకులు , బూత్ కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

రెంజల్‌లో..

జోరుగా బూత్ కమిటీల ఏర్పాటు

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీ నాయకులు గ్రామాలలో బూత్ కమిటీలను జోరుగా ఎన్నుకుంటున్నారు. దాంతో ఆదివారం బోధన్ నియోజకవర్గంలోని బోధన్, ఎడపల్లి, నవీపేట్, రెంజల్, సాలూర మండలంలో బూత్ కమిటీలను ఎంపిక చేశారు. అలాగే ఈనెల 16న ఎడపల్లి మండల కేంద్రంలోని సరయు ఫంక్షన్ హాల్‌లో 5000 మంది బూత్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు.

రెంజల్:రెంజల్ మండలంలోని నీల, కళ్యాపూర్ గ్రామాల్లో బూత్ స్థాయి కమిటీలను ఎంపిక చేయడం జరిగిందని బీఆర్ఎస్ మండల నాయకులు పేర్కొన్నారు. నీల గ్రామంలోని రైతు వేదికలో ఐదు బూత్ కమిటీలను ఎంపిక చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రఘు, ఈసా, నాయకులు రాఘవేందర్, గఫ్ఫార్, లింగం, భాస్కర్, అక్తర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. కళ్యాపూర్ గ్రామంలో రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షులు కాశం సాయిలు ఆధ్వర్యంలో బూత్ కమిటీలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు పిల్లల ప్రవీణ్, బంటు లక్ష్మణ్, కుమార్, అనిరుద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బోర్గం పీఏసీఎస్ గోదాం నిర్మాణానికి 15 లక్షలు మంజూరు



ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ మోపాల్

మండలం లోని బోర్గం(పి) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం నిర్మాణానికి టీఎస్ఆర్టిసి చైర్మన్, నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ 15 లక్షల రూపాయల ఉత్తర్వుల పత్రాలను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో సొసైటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎన్డీసీసీబీ బ్యాంక్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. బాజిరెడ్డి తమ సొసైటీకి అనుక్షణం అండగా ఉంటూ.. సొసైటీ కావాల్సినంఒ అడగగానే మంజూరు చేస్తున్నరాని తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి , డిసిసిబి డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, బోర్గాం సొసైటీ డైరెక్టర్లు జయకృష్ణ, దాసు, శేఖర్ రెడ్డి, సాయి రెడ్డి, నరేష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

జోనల్- కోఆర్డినేటర్‌గా నవీన్ గౌడ్ నియామకం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



నియామక పత్రం అందుకుంటున్న నవీన్‌గౌడ్

జాతీయ రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన అధ్యక్షురాలు మాజీ పార్లమెంట్ సభ్యురాలు మీనాక్షి నటరాజన్, రాష్ట్ర అధ్యక్షులు సిద్దేశ్వర్ ఇందల్‌వాయి మండలంలోని ఇందల్‌వాయి గ్రామానికి చెందిన మోత్కూరి నవీన్ గౌడ్‌ను కరీంనగర్, సిద్దిపేట్, సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్‌లకు జోనల్ కోఆర్డినేటర్‌గా నియమించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇంచార్జీ, డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికేల నర్సారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాట్ పల్లి నగేష్ రెడ్డి,పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, కిసాన్ జిల్లా అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి , నిజామాబాద్ రూరల్లోని అన్ని మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుల సమక్షంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ఈ నియామక పత్రాన్ని ఆదివారం అందజేశారు.

కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు విఠోబా శేఖర్ మాతృమూర్తి పోహర్ గంగుబాయ్ ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఎమ్మెల్యే, పియుసి చైర్మన్, బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్ రెడ్డి విఠోబా శేఖర్ కుటుంబ సభ్యులకు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కౌన్సిలర్ గంగా మోహన్ చక్రు, బీఆర్ఎస్ నాయకులు పూజ నరేందర్, పండిత్ ప్రేమ్, కాందేష్ శ్రీనివాస్, పండిత్ పవన్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ - ముప్కాల్

ముప్కాల్ జాతీయ రహదారి 44 నెంబర్ బైపాస్ రోడ్డుపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్సాపల్లి ప్రవీణ్ (32) తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లివస్తుండగా ముప్కాల్ బైపాస్ రోడ్డుపై గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై భాస్కర చారి తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఇబ్రహీంపట్నం మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడి సోదరుడు అరుణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పీవీ శ్రీనివాస్‌కు ఆశయ సాధనకు కృషిచేయాలి

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు, విద్యార్థి, యువజన రంగంలో రాష్ట్ర బాధ్యతల్లో పనిచేసిన పివి శ్రీనివాస్‌కు పార్టీ నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ.. పీవీ శ్రీనివాస్ విద్యార్థి, యువజన రంగాల్లో అనేక ఉద్యమాలలో పాల్గొని పట్టణ పేదల సంక్షేమ సంఘం రాష్ట్ర బాధ్యతలు నిర్వహించారన్నారు. పట్టణాల్లో పేదలు నివసించే కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలను ఇవ్వటంతో పాటు తాగునీరు, మురికి కాలువల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. నేటికీ అనేక కాలనీలో మౌలిక సదుపాయాలను కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన శ్రద్ధను పెట్టకపోవడంతో పేదల బతుకుల్లో మార్పులు రావటం లేదని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజలసమస్యలను పరిష్కరించడంలో శ్రద్ధ చూపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పీవీ శ్రీనివాస్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహాన్, ఎం గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, నగర కమిటీ సభ్యులు డి కృష్ణ, మహేష్, మరియు సాయి, భాస్కర్, హైమద్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం ఎంతో ఉపయోగం

కామారెడ్డి జిల్లాకేంద్ర గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



గ్రంథాలయ చైర్మన్‌కు పుస్తకాన్ని అందజేస్తూ..

జీవన మార్గంలో పుస్తక పఠనం ఎంతో ఉపయోగ పడుతుందని కామారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ అన్నారు. కామారెడ్డి జిల్లాలో నవతెలంగాణ పబ్లికేషన్ హౌస్ వారి ఆధ్వర్యంలో పుస్తకాల విక్రయాల సెంటర్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్‌ను కలిసి నవతెలంగాణ బుక్ హౌస్ వారు అందించే పుస్తకాలు స్వతంత్ర ఉద్యమ నాయకుల చరిత్రలు, సాహిత్యం, నవలలు, ఆర్థిక అంశాల పుస్తకాలు, విద్యార్థులకు, యువతకు కాంపిటీషన్ పుస్తకాలు, సామాజిక అంశాల పుస్తకాల వంటివి అందుబాటులో ఉంటాయని బుక్ హౌస్ ఇంచార్జ్ నితిన్ వివరించారు. అనంతరం కామారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ భారత రాజ్యాంగం పుస్తకాన్ని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ మాట్లాడుతూ పుస్తకాలు చాలా బాగున్నాయి అని, యువత ఆన్ లైన్‌కు అలవాటు పడిపోయి అసలు అంశాలను తెలుసుకోలేక పోతున్నారని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు

రోడ్ల పనులు నిరంతరంగా కొనసాగించాలి

స్థానిక రైతుల వెల్లడి

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని బందల్లా, మాచాపురం, గంగమ్మ తల్లి, శివాలయం బైపాస్ రోడ్ల మరమ్మత్తు పనులు నిరంతరంగా కొనసాగించాలని లేకుంటే 15 రోజుల తర్వాత కార్యాచరణ ఉంటుందని రైతులు పేర్కొన్నారు. ఆదివారం రైతులు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. 45వరోజు రోడ్ల మరమ్మతులు జరిపించాలని రిలే నిరాహార దీక్ష చేపట్టిన రైతుల వద్దకు బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్ రాజ్, తహసీల్దార్ రామచందర్, ఎస్సై ఉదయ్ కుమార్‌లు ప్రొసీడింగ్ ఆర్డర్ వచ్చిందని త్వరలోనే రోడ్ల మరమ్మతు పనులు జరుగుతాయి దీక్ష విరమించుకోవాలని కోరగా రైతులు అందుకు సమ్మతించలేదన్నారు. గతంలో కోటి 54 లక్షల రూపాయల మంజూరు అయ్యాయని, శిలాఫలకం వేసినప్పటికీ రోడ్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం మూడు కోట్ల 45 లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిసిందని, పనులు నిరంతరంగా జరిపించినట్ల యితే తాము స్వచ్ఛందంగా విరమించుకుంటా మని వారు తెలిపారు. 46వ రోజు యధావిధిగా రిలే నిరాహార దీక్ష కొనసాగుతూ ఉండగా సర్పంచ్ మండలంలోని ప్రజాప్రతినిధు లందరినీ దీక్షా శిబిరం ఎదుట మోహరించి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి.. దీక్షను విరమించా లని బీఆర్ఎస్ నాయకులను తమ పైకి ఉసిగొల్పడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇప్పటికైనా పనులను నిరంతరంగా కొనసాగించినట్లయితే రైతులకు ఎలాంటి అభ్యంతరం లేదని, పనులను నిలిపివేస్తే మాత్రం రైతుల కార్యచరణను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు అమ్రాద్ వెంకటి, ఇందిరా రెడ్డి, కొండల్ వాడి శ్రీనివాస్, కటిక శ్రీనివాస్, చుక్క రాజు గౌడ్, తిరుపతి హనుమన్లు (బుజ్జి) సగ్గ వెంకటి, దేశ్ పేట్ పోశెట్టి, మదన్ మోహన్ రెడ్డి, స్థానిక రైతు నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

బిజెపి రాష్ట్ర నాయకులు వడ్డీ మోహన్ రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి



జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

భారతీయులందరూ 15 ఆగస్టు 76వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తలపెట్టిన హర్ గర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు ఇంటిపై జాతీయ జెండాను ఏర్పాటు చేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు వడ్డీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో హర్ గర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బిజెపి నాయకులు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటిపై త్రివర్ణ పథకాన్ని ఎగరావేయాలని ఇంటిటికీ వెళ్లి తెలిపారు. జాతీయ జెండాలతో ఆ పార్టీ నాయకులు యువకులు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో బోధన్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్, దిశా కమిటీ సభ్యులు వడ్డేపల్లి గ్రామ సర్పంచ్ కూరెళ్ల శ్రీధర్, పోచారం సర్పంచ్, ఎడపల్లి మండల బిజెవి అధ్యక్షులు ఇంద్రకరణ్, రెంజల్ మండల అధ్యక్షులు గోపి, జాన్కంపేట్ సర్పంచ్ సాయిలు, ఎడపల్లి మండల ప్రధాన కార్యదర్శి సృజన్, నాయకులు హన్మాండ్లు, వివిధ మోర్చాలా అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇంచార్జ్ లు బూత్ అధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని దానాల్లోకెళ్ల రక్తదానం గొప్పది



రక్తదానం చేస్తున్న యువత

నవతెలంగాణ-సిరికొండ

అత్యవసర సమయాలలో ప్రమాదాలు సంభవించినప్పుడు తోటివారి ప్రాణాలు కాపాడేది రక్తం మాత్రమేనని ధర్పల్లి జడ్పిటిసి, జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్ మోహన్ అన్నారు.ఆదివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభ మల్టి స్పెషాలిటీ ఆసుపత్రి, రెడ్ క్రాస్ సొసైటీ వారు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... అన్ని దానాల్లోకెళ్ల రక్తదానం గొప్పదని, ఆపద సమయంలో మనం చేసే రక్తదానం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. యువత మత్తుకు బానిసలు కాకుండా స్వచ్ఛంద సేవా కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పిటిసి మాన్ సింగ్ నాయక్, రాజారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, విడిసి చెర్మెన్ బడాల సంతోష్, ఆకుల తిరుమల్, సర్పంచులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా దేగాం ప్రమోద్

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండలంలోని దేగం గ్రామానికి చెందిన ప్రమోద్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా నియమితు లయ్యారు. నియామక పత్రాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా దేగం ప్రమోద్ మాట్లాడుతూ.. నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు దేగం ప్రమోద్ కు శుభాకాంక్షలు తెలిపి, కాంగ్రెస్ పార్టీ పతిష్టతకు కృషి చేయాలని కోరారు.

రోగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ - ముప్కాల్

ఆర్మూర్ లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రిలో ఆదివారం ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన ముగ్గురు కంటి రోగులకు కంటి ఆపరేషన్ నిర్వహించి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముప్కాల్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్ రోగులకు పండ్లు, బలానికి సంబంధించిన బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు జక్కుల రాము, కట్ట మహేష్, లోక నర్సయ్య తదితరులు పాల్గొన్నారు..

ఎంఆర్‌వోకు సన్మానం


ఎమ్మార్వోను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

నవతెలంగాణ-భిక్కనూర్
భిక్కనూర్ మండల తహసీల్దార్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన శివ ప్రసాద్‌ను శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ పునర్నిర్మాణ కమిటీ డైరెక్టర్, కంచర్ల గ్రామ మాజీ సర్పంచ్ చంద్రం శాలువాతో ఘనంగా సన్మానించారు. రెవెన్యూ అధికారులకు ప్రజాప్రతిథులు సహకరించాలని తహసీల్దార్ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్దన్ రెడ్డి, శ్రావణ్ గౌడ్, శంకర్ గౌడ్, బాబు, ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.

వేముల సురేందర్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణ



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని కొనాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు నాయకులు స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి విగ్రహాన్ని ఆయన కుమారుడైన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి రైతులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత రైతాంగం కోసం సురేందర్ రెడ్డి పడిన తపనను మంత్రి ప్రశాంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తానని, ఈ ప్రాంత రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. జోహార్ సురేందర్ రెడ్డి సార్ అంటూ ప్రాంగణమంతా నినాదాలతో మారుమోగింది.

గిరిజనుల బతుకమ్మ 'తీజ్'

- పకృతిని ఆరాధిస్తూ.. పూజిస్తూ వేడుకలు

నవతెలంగాణ-గాంధారి
గిరిజనులు అంటేనే ఆచార వ్యవహారాలు, సాంస్కృతి సంప్రదాయాలు. వారి వస్త్ర అలంకరణ, పండగలు జీవన శైలి భిన్నంగా ఉంటుంది. సంప్రదాయలకు విలువలుకు పెట్టింది పేరు. అడవుల్లో ప్రారంభమయిన వారి జీవితాలు హైటెక్ యుగంలోకి మారినా సంస్కృతి సంప్రదాయలను పరిరక్షించుకోవలో నిరంతరం కృషి చేస్తున్నారు. వందల సంవత్సరం నుండి గిరిజన తండాల్లో తీజ్ పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు.

ప్రతి సంవత్సరం వర్షాకాలం ఆరంభంలో గిరిజన తండాలో తీజ్ పండగను ఘనంగా నిర్వహిస్తు న్నారు. తండాలో బాగా వర్షాలు కురిసి పంటలు బాగా పండలని తండాలోఅందరు సుఖ సంతోషలతో ఉండాలని తండాలో యువతులు తీజ్ పండగను నిర్వహిస్తున్నారు.

తీజ్ అంటే గిరిజన బాషలో మొలక అని అర్థం. గిరిజనతండాలో నిర్వహించే ఈ పండగ పెళ్లి కానీ యువతులు చేత నిర్వహించడం అనవాయితి. వర్ష కాలం ప్రారంభంలో గిరిజనులు సీత్ల భవానీపండగ తరువాత తీజ్ పండగను తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు

ఇలా మొదలు
ముం దుగా తండా నాయకుడి అనుమతి తీసుకొని తండాలో ఏ శు భకార్యం అయినా నిర్వహి చడం అనవాయితీ. ఈ పండగ నిర్వహణ కోసం అవసరం అయిన గోదుమలు, శనగలు, పండగ నిర్ణయించిన రోజుకు తొమ్మిది రోజుల ముందే విత్తనాలు నాటుతారు.


తీజ్ బుట్టలు


తీజ్ బుట్టలను ఎత్తుకొని వేడుకల్లో పాల్గొన్న యువతులు

పవిత్రగా తీజ్ పెంపకం
విత్తనాలను మొలకెత్తించడానికి అవసరమైన బుట్టలను వెదురుతో తయారు చేస్తారు. బుట్టలలో పుట్టమన్నుపోసి సహజ ఎరువులను కలిపి బుట్టలో నానాబెట్టిన గోదుమలను బట్టలపై జల్లుతారు.

ఇంటికో బుట్ట
తండాలో ఒక్కక్క ఇంటి నుండి ఆడ పిల్లలందరూ ఒక్క తీజ్ బుట్టను తీసుకొని బుట్టలను ఓకే స్థలంలో ఉంచడానికి వీలుగా తండా నాయకుడి ఇంటి ముందు పందిరి వేస్తారు. పందిరి పై బుట్టలను ఉంచుతారు. పందిరి పై వున్నా బట్టలకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నీళ్ళు పోస్తారు. తొమ్మిది రోజులు తండాలో వివిధ రోజుల్లో వివిధ కార్యక్రమలు నిర్వహిచుకుంటారు.

చివరి రోజు అత్యంత వైభవం..
చివరి రోజు బంధువులు, తండా నాయకుడి ఆధ్వర్యంలో తీజ్ పండగను ఘనంగా నిర్వహిస్తారు. పందిరి నుంచి తీజ్ బుట్టలను తీసి మొదట తండా నాయకుడు తలపై పెట్టుకుంటారు. అందరు గుంపుగా సంప్రదాయ గీతాలతో నృత్యాలు చేస్తారు. అనతరం మొక్కులను సోదరులకు ఇచ్చి ఆశీర్వాదం తీసుకుంటారు. ఆడపిల్లలు తీజ్ బుట్టలను తీసుకొని మైదానంలో వరుస క్రమంలో కూర్చుంటారు. వారికీ బంధువులు కానుకలు ఇవ్వడంతో తిరిగి వారికీ గోధుమ మొలకలు అందిస్తారు. అనంతరం డప్పు వాయిద్యాలతో వాటిని నిమజ్జనం చేసి వెళ్లి పోతున్నప్పుడు గోధుమ మొలకలను చూసి ఆడ పిల్లలు దుఃఖిస్తారు. జీవితాంతం నీకు అండగా ఉంటూ రక్షిస్తామని సోదరిమణులకు కళ్లను కడిగి పదాభివందన చేస్తారు సోదరులు. చివరి రోజు యువతులు చేసే సంప్రదాయ నృత్యలు సాంప్రదాయబద్ధంగా ఉంటాయి. ఈ ప్రక్రియ వివిధ తండాలో వివిధ రకాలుగా నిర్వహిస్తున్నారు.

నర్సాపూర్‌లో గడపగడపకు కాంగ్రెస్


గడపగడపకు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని నర్సాపూర్ గ్రామంలో హాథ్ సే హాత్ జోడో యాత్రకు కొనసాగింపుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు సంజీవ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి తరపున గ్రామంలో విద్యార్థి నిరుద్యోగ యువకులతో కలిసి ప్రతి ఇంటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ రేపు అధికారంలోకి రాగానే ప్రజలకు అందించబోయే సంక్షేమ పథకాల గురించి కరపత్రాలు పంచి ప్రజలకు వివరిస్తున్నామన్నారు. గత తొమ్మిది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తారనే నమ్మకం ఉందన్నారు. బాల్కొండ నియోజకవర్గం లోని ప్రజలు మానాల మోహన్ రెడ్డిని బలపరుస్తారని, ఆయనను ఆశీర్వదిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యుఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గౌండ్ల రమేష్ గౌడ్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మండల శేఖర్, వెంకట్ గణేష్, కోయట్ గంగాధర్, సోమిడీ లింబయ్య, ధర్పల్లి రాకేష్, అనిమేనా వెంకటేశ్ యాదవ్, ఉప్పు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరికలు

నవతెలంగాణ-భిక్కనూర్
మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఇతర పార్టీల నుండి బిజెపి పార్టీ కామారెడ్డి నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జ్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నరేందర్, నర్సారెడ్డి, వసంత్ రెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండా గ్రామపంచాయతీ పరిధిలో కొట్టకింద తండ కత్రాత్ బుడ్డు (45) మూడు రోజుల క్రితం కరెంట్ షాక్ తో మృతి చెందిన విషయం తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేసి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట సాయిలు, వహీద్, అనిల్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటొరెడ్డి, సమేల్, గణేష్, శ్రీకిందర్, లక్ష్మణ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

పకృతిని పూజించే పండుగ.. తీజ్


తీజ్‌పండుగలో పాల్గొన్న పైడి రాకేశ్‌రెడ్డి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/ఆర్మూర్
గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ అని ప్రముఖ పారిశ్రామిక వేత్త బిజెపి నాయకులు పైడి రాకేష్ రెడ్డి అన్నారు. ఆలూరు మండలం గుత్పా తండా, మాక్లూర్ మండలం ఎల్య నాయక్ తండా గ్రామంలో తీజ్ పండుగ కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ గిరిజనుల ఆరాధ్య దైవం సేవలల్ అని ప్రకృతిని పూజించే సంస్కృతి నిత్యం ప్రకృతి ఒడిలో ఉంటు పనులు చేసే గొప్ప సంస్కృతి గిరిజనులది అని అన్నారు. కార్యక్ర మంలో బీజేపీ అసెంబ్లి కన్వీనర్ పలెపూ రాజు , అలుర్ మండల అధ్యక్షుడు గిరీష్, మాక్లూర్ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని సోమర్యఘడ్‌తండాలో ఆదివారం నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్‌మోహన్ పాల్గొన్నారు. ఆయనకు తండా వాసులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మదన్ మోహన్ యూత్ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.


గిరిజన చిన్నారులతో మదన్‌మోహన్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ విప్ లక్ష్యం

- ఎంపీపీ గాల్ రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ

నవతెలంగాణ-భిక్కనూర్
ప్రజా సంక్షేమమే ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ లక్ష్యమని ఎంపీపీ గాల్ రెడ్డి తెలిపారు. గత నెలలో మండలంలోని జంగంపల్లి గ్రామ పర్యటనలో భాగంగా ప్రజా ప్రతినిధులు, గ్రామస్తుల కోరిక మేరకు ఇచ్చిన మాట ప్రకారం సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం కొరకు ఏం డి ఎఫ్ నిధుల నుండి 5.75 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినందుకు ప్రభుత్వ విప్ కు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ఆదివారమిక్కడ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పద్మ నాగభూషణం గౌడ్, ఏఎంసీ చైర్మన్ హనుమంత్ రెడ్డి, సర్పంచ్ నర్సింలు యాదవ్, వైస్ ఎంపీపీ యాదగిరి, డిసిసిబి డైరెక్టర్, సొసైటీ చైర్మన్ సిద్ధరాములు, ఎంపీటీసీ యశోద, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ భాస్కర్, సొసైటీ వైస్ చైర్మన్ వాసు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ


రమణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-రాజంపేట్
మండలంలోని పొందుర్తి గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘ సభ్యుల ఆహ్వానం మేరకు ఆదివారం పెద్దమ్మ గుడి ఆవరణలో కళ్యాణమండపం నిర్మాణానికి బిజెపి కామారెడ్డి అసెంబ్లీ ఇంచార్జ్ కాటిపల్లి వెంకట రమణారెడ్డి భూమి పూజా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజుల అభ్యున్నతికి తోడ్పడడానికి గ్రామంలో ముదిరాజ్‌లకు ఒక కళ్యాణ మండపం ఎంతైనా అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు, మండల అధ్యక్షులు దేవి రెడ్డి గంగారెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సంధ్య, ప్రధాన కార్యదర్శి పిట్ల శ్రీనివాస్, బీజేవైఎం అధ్యక్షులు సంపత్ రెడ్డి, ఎస్సీ మోర్చా జనరల్ సెక్రెటరీ కంకణాల సిద్ధ రాములు, కుందుర్తి గ్రామ అధ్యక్షులు కుమ్మరి రమేష్, సాయిరెడ్డి, రాము దుర్గాప్రసాద్, సాకలి సంతోష్, మండల ఐటీ సెల్ కన్వీనర్ జంగం మనోహర్ వివిధ గ్రామాల కార్యకర్తల నాయకులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో మేక మృత్యువాత


మృత్యువాతపడ్డ మేక

నవతెలంగాణ-తాడ్వాయి
తాడ్వాయి మండల కేంద్రంలో విద్యుద్ఘాతంతో మేక మృత్యువాత పడిందని గ్రామస్తులు తెలిపారు. చెట్కూరి రవికి చెందిన మేక మేత మేస్తుండగా.. ఎలాంటి భద్రత లేకుండా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ తాకి మేకమృత్యువాత పడినట్లు తెలిపారు. రూ.10 వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కు కంచే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో సైతం ఓ మేక మృతి చెందినట్లు వారు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపుతో
ప్రజాసమస్యలకు పరిష్కారం

- మాజీ మంత్రి షబ్బీర్‌అలీ


మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

నవతెలంగాణ-రాజంపేట్
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజా సమస్యలు పూర్తిగా తీరుతాయని మాజీమంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ పేర్కొన్నారు. హత్ సే హత్ జోడో కార్యక్రమంలో భాగంగా రాజంపేట్ మండల కేంద్రంలో ఆదివారం గడపగడపకు తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని చౌరస్తాలో పబ్లిక్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజల సమస్యలు పూర్తిగా తీరుతాయని అదేవిధంగా సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. రూ.500 కే వంట గ్యాస్ ను అందజేస్తామని, రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ, నిరుద్యోగులకు 4000 భృతి, ఐదు లక్షలు ఇంటి నిర్మాణానికి, ఐదు లక్షల వరకు ఉచిత వైద్యం, రెండు లక్షల ఉద్యోగాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాదవ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు అంకం కృష్ణారావు సీనియర్ నాయకులు వీరన్న, బాలకృష్ణ అక్బర్,పట్టణ అధ్యక్షులు రంగ గంగాధర్ గౌడ్,పట్టణ యువజన అధ్యక్షులు షాదుల్, రైతు విభాగం మండల అధ్యక్షులు జూకంటి సుధాకర్ రెడ్డి, మండల మైనారిటీ అధ్యక్షులు అప్సర అలీ, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు షేక్ జమీల్,గ్రామ కార్యదర్శి వాజిత్ సల్మాన్, అఫ్రోజ్, స్వామి,నారాయణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘటితం.. సమానత్వంతో రాజ్యాధికార సాధన

- కోరుట్లకు తరలిన పద్మశాలినేతలు

నవతెలంగాణ-బోధన్/తాడ్వాయి
కోరుట్ల పట్టణంలో ఆదివారం నిర్వహించిన పద్మశాలి రాజకీయ యుద్ధభేరి సభకు బోధన్ పట్టణంలోని పద్మశాలి సంఘం నేతలు వాహనాలలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంఘటితం, సమానత్వం, రాజ్యాధికార సాధన కోసం జిల్లా పద్మశాలి కమిటీ పిలుపు మేరకు కోరుట్ల పట్టణంలో జరుగుతున్న పద్మశాలి రాజకీయ యుద్ధభేరి సభలో పాల్గొనడానికి పట్టణ, మండల పద్మశాలీ సంఘ సభ్యులు తరలి వెళ్తున్నట్లు తెలిపారు. బోధన్ పట్టణ, మండల పద్మశాలి అధ్యక్షుడు గంగుల దేవిదాస్ , ఉషాకొయ్యల రవీందర్‌ల ఆధ్వర్యంలో తరలివెళ్లారు.


బోధన్ నుంచి తరలుతున్న పద్మాశాలి నాయకులు

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు లోల శంకర్, బోధన్ నియోజకవర్గ పద్మశాలి ప్రధానకార్యదర్శి లోకం శ్రీనివాస్, కౌన్సిలర్ వినోద్, పట్టణ మండల తర్ప పెద్దలు అడెపు గంగాధర్, బిళ్ల శంకర్, గోనె ప్రవీణ్, సుంకం చంద్రశేఖర్, కల్లుర్కి అశోక్, గంగుల దినేష్, నవీన్ తదితరులు ఉన్నారు.

రాజకీయ యుద్ధభేరికి తరలిన పలువురు
తాడ్వాయి : తాడ్వాయి మండలం నుంచి పద్మశాలి సంఘం నాయకులు ఆదివారం కోరుట్లకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కోరుట్లలో నిర్వహించిన పద్మశాలి యుద్ధభేరి సభకు వెళ తున్నట్లు తెలిపారు. పద్మశాలీలు రాజకీయంగా ఆర్థికంగా బలోపేతం కావాలని వారు కోరారు. నాయకులు పద్మశాలీలను రాజకీయంగా అణిచివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పద్మశాలీలకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు సాయిబాబా, కృష్ణమూర్తి, అరవింద్ ,స్వామి తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానంతో
పేదలు ఉన్నత విద్యకు దూరం

- యూనివర్సిటీలలో విద్యార్థి ఎన్నికలు నిర్వహించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి డిమాండ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి
కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం-2020 ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసి విదేశీ యూనివర్సిటీలను తీసుకురావడం దారుణమని, నూతన జాతీయ విద్యా విధానం అమలు అయితే పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారే అవకాశం ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి అన్నారు. ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ యూనివర్సిటీ కమిటీ విస్తృత స్థాయి సమావేశం యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి సంధ్యారెడ్డి అధ్యక్షతన వహించారు. ఈ మధ్య కాలంలో మృతి చెందిన అమరులకు సంతాపం తెలియజేసీ సమావేశం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు (ఓయూ రీసర్చ్ స్కాలర్) ఆర్.ఎల్ మూర్తి పాల్గొని మాట్లాడుతూ ప్రైవేటు యూనివర్సిటీలలో పేద విద్యార్థుల కోసం రిజర్వేషన్లను అమలు చేయకుండా ఇష్టానుసారంగా ఫీజులను పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దు కోసం అనేక పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ విద్యా విధానం కోసం అడుగులు వేయాలని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ యూనివర్సిటీ కి రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ ను నియమించాలని డిమాండ్ చేశారు

ఇన్చార్జ్ వైస్ చాన్సలర్ గా ఉన్న వాకటి కరుణ విద్యార్థులు ఎదుర్కొం టున్న సమస్యల పైన కరుణించాలని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర యూని వర్సిటీలలో విద్యార్థి ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. అదేవిధంగా వర్సిటీలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి వలె అనే చందంగా తయారైంది వాపోయారు. వెంటనే అడ్మినిస్ట్రేషన్ యంత్రాంగం క్యాంటీన్ ని ప్రారంభించాలి అని ఓపెన్ జిమ్లను స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. అదేవిధంగా లైబ్రరీని 24/7 గంటలు విద్యార్థుల సౌకర్యం కోసం ఓపెన్ చేసి ఉంచాలని అన్నారు. అదేవిధంగా లైబ్రరీలో కాంపిటేటివ్ యుజిసి నెట్ సెట్ ల కు సంబంధించి పుస్తకాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. అదేవిధంగా క్యాంపస్ లో చదివే ప్రతి విద్యార్థికి ప్లేస్మెంట్ ను కల్పించాలని అదే విధంగా ప్లేస్మెంట్ సెల్ ని, కాంపిటేటివ్ సెల్ ని ఏర్పాటు చేయాలని అన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు మూర్తి

ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఎన్నిక
ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ నూతన కార్యదర్శిగా వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కర్యదర్శులు రాచకొండ విఘ్నేష్, అనిల్, యూనివర్సిటీ ఉపాధ్యక్షులు సంధ్య రెడ్డి, సాయి ప్రసాద్, సహాయ కార్యదర్శులు దినేష్, ఆదిత్య, చాత్రు,చరణ్, నాయకులు మహేష్, శ్రావణి, అస్మిత్, పవన్, అనంత్ రావు పాల్గొన్నారు.

సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో
కట్ట మైసమ్మ పండగ



నవతెలంగాణ-వేల్పూర్
మండలంలోని రామన్నపేట గ్రామంలో ఆదివారం గ్రామ ఆలయ సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో బోనాలతో ఘనంగా కట్ట మైసమ్మ పండగ నిర్వహించారు. ఇటీవలే కురిసిన వర్షాలకు చెరువులు నిండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

స్వచ్ఛ కాలనీ కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఆదివారం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఆదివారం తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా 11వ వారం కాలనీ వాసులు రెండు గంటల పాటు శ్రమదానం చేశారు. కాలనీ వాసులు చీపుర్లు పట్టుకొని రోడ్లు ఊడ్చారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగు కాలువలు శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను, పొదలను తొలగించారు. ముళ్ళ చెట్లను కొట్టేశారు. గుంతల్లో మొరం మట్టి వేశారు. పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి బి. కమలాకర్, ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న, సుంకే శ్రీనివాస్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, కార్యదర్శులు కొంతం రాజు, ఎల్.సాయన్న, కాలనీ పెద్దలు నారా గౌడ్, గంగాధర్, ప్రవీణ్, ఎల్. టి. కుమార్, భాజన్న తదితరులు పాల్గొన్నారు.

13 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి

- పద్మశాలీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జోగు నర్సయ్య
- చలో కోరుట్లకు తరలి వెళ్లిన పద్మశాలీలు

నవతెలంగాణ - విలేకరులు
ముప్కాల్:పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి (ఛలో కోరుట్ల)కు మండల కేంద్రం నుంచి పద్మశాలీ కులస్తులు ఆదివారం వాహనాల్లో బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గ పద్మశాలీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జోగు నర్సయ్య మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీలు 13 మందికి అసెంబ్లీ స్థానాలు, పార్లమెంట్‌లో మూడు ఎంపీ సీట్లు సైతం కేటాయించాలని కోరారు. బీసీ కులస్తులు రానున్న రోజుల్లో రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని అన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు బ్రమ్మదండి లింగం, జిల్లా కార్యదర్శి గురుడు దయనంద్, సభ్యులు పెంటు గంగాధర్, బ్రహ్మదండి కమలాకర్, పెండెం జ్ఞానేశ్వర్, చిల్క సుదర్శన్, జక్కం రాజేందర్, మ్యాక శివ కుమార్, దాసరి నరేష్, తదితరులు పాల్గొన్నారు..

డిచ్‌పల్లి:డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాలకు చెందిన పద్మశాలి సంఘ సభ్యులందరూ "చలో కోరుట్ల "పద్మశాలి రాజకీయ యుద్ధభేరి" కార్యక్రమానికి మండలంలోని గ్రామల నుండి పద్మశాలి కుల సోదరులందరూ తరలి వెళ్లారు. తరలివెళ్ళిన వారిలో రూరల్ పద్మశాలీ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ చిలువేరి దాస్, రూరల్ అధ్యక్షులు వాసు, నూకల రమేష్, చిలుక రాజు, జిల్లా పద్మశాలి సంఘ కార్యవర్గ సభ్యుడు శక్కరికొండ కృష్ణ, అధ్యక్షుడు అంకం నరహరి, రేగుంట విశ్వ ప్రకాష్, అంకం గిరి, రామకృష్ణ, వరకాల శ్రీనివాస్, హన్మంత్, లింబాద్రి, కొండ మురళి, లక్ష్మి నారాయణ, అంకం లడ్డు, రాంబద్రి ప్రసాద్, గణేష్, విట్టల్, లక్ష్మణ్, ఎమ్మాజీ గంగాధర్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:చలో కోరుట్ల కార్యక్రమానికి పద్మశాలీలు ఆదివారం తరలి వెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి చలో కొరుట్ల కార్యక్రమానికి వెళ్తున్నట్లు మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీపతి శేఖర్ తెలిపారు . కోరుట్లలో నిర్వహించే పద్మశాలీ రాజకీయ యుద్ధభేరీకి తరలి వెళ్తున్నామని తెలిపారు. పద్మశాలిల ఆత్మ గౌరవ సభ కు వాహనాల ద్వారా బయలుదేరి వెళుతున్నామని చెప్పారు.

సిరికొండ:మండలానికి చెందిన పద్మశాలి సంఘ సభ్యులు ఆదివారం చలో కోరుట్ల పద్మశాలి రాజకీయ యుద్ధభేరికి బయలుదేరినట్లు పద్మశాలి జిల్లా ఉపాధ్యక్షులు దాసరి మారుతి, సంఘ సభ్యులు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... పద్మశాలి ఐక్యతను చాటాలని, పద్మశాలీల అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈయన వెంట సంఘం సభ్యులు దాసరి నరేష్, కిరణ్, భరత్, ఆనంద్, గంగాధర్, భోజన్న, శేఖర్, లక్ష్మణ్, దేవయ్య, నర్సయ్య, తదితరులు ఉన్నారు.



ముప్కాల్ : చలో కొరుట్లకు వెళ్తున్న నాయకులు

బీసీ యువజన సంఘం
రాష్ట్ర కార్యదర్శిగా కొయ్యాడ శంకర్



నియామక పత్రం అందజేస్తున్న నాయకుఉ

నవతెలంగాణ-కంఠేశ్వర్
గతంలో నిజామాబాద్ బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన కొయ్యాడ శంకర్ స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చెయ్యడంతో రాష్ట్ర బాధ్యతలు అప్పగించినట్టు జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కంకనాల శ్యాం మాట్లాడుతూ.. కొయ్యాడ శంకర్ పలు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి యువతకు మార్గదర్శకులుగా నిలబడ్డారని గుర్తు చేసారు. తనను నమ్మి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు ఇప్పించిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ కు కొయ్యాడ శంకర్ ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కంకనాల శ్యాం, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్, జిల్లా యువజన సంఘం జిల్లా అధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ



గొర్రెలు తీసకున్న లబ్ధిదారులు

నవతెలంగాణ-మాక్లూర్
మండలంలోని ముల్లంగి(బి), మాక్లూర్ గ్రామాలకు గొర్రెల పంపిణీ పథకం ద్వారా గొర్రెలను లబ్ధిదారులకు ఆదివారం పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న గొర్రెల పంపిణీ లో బాగంగా మాక్లూర్ గ్రామానికి 5 యూనిట్లు, ముల్లంగి (బి) గ్రామానికి 6 యూనిట్లు వచ్చాయి. ఒక్కో యూనిట్ కు 20 గొర్రెలు, ఒక్క పొట్టేలు లబ్ధిదారులకు అందాయి. ఈ గొర్రెలను కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ ప్రాంతం నుంచి లబ్దిదారులు వెళ్లి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పశువైద్యులు డా. కిరణ్ దేశ్ పాండే, గ్రామ గొర్రెలు, మేకల సహకార సంఘం అధ్యక్షులు మహేందర్, లబ్దిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వర్క్ షాప్ విజయవంతం చేయండి: పీడీఎస్‌యూ

- ఈనెల 17,18న హైదరాబాద్‌లో వర్క్‌షాప్



వర్క్‌షాప్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
హైదరాబాద్‌లో ఈనెల 17, 18న నిర్వహించే రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ ను విజయవంతం చేయాలని పిడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఆర్.గౌతమ్ కుమార్, జన్నారపు రాజేశ్వర్ విద్యార్థి లోకాన్ని కోరారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం వర్క్ షాప్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, అందరికీ ఉచిత విద్య కావాలని, శాస్త్రీయ విద్యాసాధన కోసం పీడీఎస్‌యూ పోరాడుతుందని అన్నారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంతరాలు తొలగి సమ సమాజం రావాలని కోరారు. విద్యార్థులను రాజకీయంగా నిర్మాణపరంగా, సామాజికంగా సాంస్కృతికంగా తీర్చిదిద్దడానికి వారిలో నాయకత్వ ప్రతిభను మరింత పెంపొందించడానికి, విద్యార్థి ఉద్యమాన్ని మరింత పదునెక్కించడానికి హైదరాబాద్‌లోని విద్యానగర్ మర్క్స్ భవన్‌లో రాష్ట్రస్థాయి వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనికి రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీ, కాలే ల నుండి విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కార్తిక్, సహాయ కార్యదర్శి ప్రిన్స్, జిల్లా నాయకులు వంశీ,ఆకాష్ యూనివర్సిటీ నాయకులు శివ సాయి,ఆకాష్, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఐక్యత కోసం కృషి

నవతెలంగాణ-మాక్లూర్
మాదిగల ఐక్యత కోసం మండల కమిటీ కృషి చేస్తుందని మండల అధ్యక్షులు దర్గాల సాయిలు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో వివిధ కమిటీలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధికంగా ఓట్లు ఉన్న మాదిగ సామాజిక వర్గాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకొని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు తెడ్డు శేఖర్, మారంపల్లి బాబు, చిరంజీవి, కోశాధికారి పుల్లెంగ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నీరడి రవి

- రవిని సన్మానించిన జాతీయ అధ్యక్షులు చెన్నయ్య

నవతెలంగాణ-రెంజల్
మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెంజల్ మండల కేంద్రానికి చెందిన నీరడీ రవిని ఎంపిక చేశారు. ఆదివారం బోధన్ పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో మాల మహానాడు డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు చెన్నయ్య నియామక పత్రం అందజేసి శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. మాలమహానాడు ఉద్యమంలో డివిజన్ ఉపాధ్యక్షులుగా ఆయన సేవలు గుర్తించిన జాతీయస్థాయి నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సేవలను గుర్తించి మరింత బాధ్యతలను అప్పగించిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన వంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ పరిరక్షణ కమిటీ బోధన్ డివిజన్ కన్వీనర్ నీరడీ ఈశ్వర్, మాల మహానాడు డివిజన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శ్రావణ్ కుమార్, దేవేందర్, నాయకులు ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని వసంత జ్యోతి హాస్పిటల్ నుండి పెర్కిట్ ఎం ఆర్ గార్డెన్స్ వరకు (ఎంజే హాస్పిటల్, కుక్కల గుట్ట మీదుగా) నూతన బిటి రోడ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఆదివారం పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా, బి ఆర్ ఎస్ నాయకులు పండిత్ పవన్, కౌన్సిలర్ అయ్యప్ప శ్రీనివాస్, శ్రీనివాస కాలనీ వాసులు జంగం అశోక్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రోడ్లకు అడ్డంగా పశువులు

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని పలు గ్రామాలలో హనుమాన్ దేవాలయాలకు వదిలిపెట్టిన ఆవులు రోడ్లపై సంచరిస్తూ ఉండడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని వీరన్న గుట్ట, సాటాపూర్, రెంజల్ తదితర గ్రామాలలో రోడ్లకు అడ్డంగా రావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వారు పేర్కొన్నారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఆవులు రోడ్లపైకి రాకుండా కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



నిజాంషుగర్ చక్కెర ఫ్యాక్టరీ కార్మికులను ఆదుకోవాలి

నవతెలంగాణ-ఎడపల్లి
బోధన్‌లో నిజాంషుగర్ ఫ్యాక్టరీ కార్మికులు రిలే నిరాహార దీక్ష చేస్తున్నందుకు 8వ రోజున కార్మికుల నిరాహార దీక్షలు ఆదివారానికి ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కెప్టెన్ కరుణాకర్ రెడ్డి దీక్ష శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు పలికారు. కార్యక్రమంలో కెప్టెన్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. నిజాంషుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు చెల్లించవలసిన పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని తెలిపారు. షుగర్ ఫ్యాక్టరీలో పనిచేసిన కార్మికులను ఆదుకోవా లని, నిజాంషుగర్ ఫ్యాక్టరీ ఆస్తులను కాపాడాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిజాం షుగర్ ఫ్యాక్టరీకి మళ్లీ పునర్ వైభవం తీసుకువస్తామని, మూతపడ్డ ఫ్యాక్టరీల గురించి తిరిగి మళ్లీ తెరిపించడానికి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టే విధంగా ప్రచార కమిటీ మెంబెర్‌గా, రైతు బిడ్డగా తన వంతు కృషి చేస్తానని కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి కార్మికులకు రైతులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కేకేసి నాయకులు ఆర్ భాస్కర్ రాజు , కాజా ఫయాజుద్దీన్ (మాజీ కౌన్సిలర్), కాజా ఖలీలుల్లా, కేకేసి బోధన్ కన్వీనర్ బుడ్డ పోశెట్టి, రాజగుప్తా, నీరడి రవికుమార్, కేకేసి ఉపాధ్యాయ బోధన్ నియోజకవర్గ కన్వీనర్ సరిదాస్, కేకేసి ఎడపల్లి మండల అధ్యక్షులు సున్నపు ఓడ్డెన్న రాజగౌడ్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం : టీవీయూవీ

- ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు విడుదల చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
తెలంగాణ ప్రజలను మోసం చేసి విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టివియువి) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత లాల్ సింగ్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలనుండి విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయకుండా తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని అన్నారు. ఎంతో మంది విద్యార్థులు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ రాక విద్య కు దూరమవుతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమయంలో కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తానని ప్రభుత్వ విద్యారంగాన్ని నీరుగార్చే విధానాలను తీసుకొస్తున్నారని ఆరోపించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల మీద ఉన్న సోయి విద్యారంగం మీద లేదని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి గత 4 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలనీ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ హాస్టల్స్ కు పక్క భవనాలు నిర్మించాలని, కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతి గ్రామం నుండి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో టివియువి నాయకులు ఆనంద్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి విజయకు ఘనంగా సన్మానం

మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో
నవతెలంగాణ-కంఠేశ్వర్
ఇటీవల యూనియన్ బ్యాంకులో పదవి విరమణ పొందిన కోటగిరి విజయకు మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ నీతూ కిరణ్ హాజరై విజయ యూనియన్ బ్యాంక్ లో చేసిన కృషిని కొనియాడారు. విజయ నిక్కచ్చిగా ఉద్యోగం చేస్తూ సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యులైనందుకు వారిని అభినందించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమైక్య నాయకులు నాంపల్లి, తెడ్డు గంగారం, మాదిగ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్, మాదిగ, రిటైర్డ్ ఉద్యోగుల అధ్యక్ష కార్యదర్శులు గుడ్ల రాములు, రమేష్, మాదిగ ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రిటైర్డ్ ఉద్యోగులు మహిళ నాయకురాలు పోసాని, తదితరులు పాల్గొన్నారు.



విజయను సన్మానిస్తున్న మేయర్, తదితరులు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి

- మాజీ ఎంపీటీసీ ఫోరమ్ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు

నవతెలంగాణ-వర్ని
మండలం కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం అధ్యక్షులు సురేష్ బాబా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర మాజి ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు డీసీసీ డెలిగేట్ యలమంచిలి శ్రీనివాస్ రావు విచ్చేసి మాట్లాడారు. రాబోయే రోజుల్లో కార్య కర్తలు సైనికుల్లా పని చేస్తూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మేని ఫెస్టోను ప్రజలకు 500లకు గ్యాస్ సిలిండర్, 4000 పెన్షన్, 2లక్షల రుణ మాఫీ, నిరుద్యోగ భృతి,15వేలు పేద కుటుంబానికి అందిస్తామని వివరిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. సమావేశంలో డీసీసీ డెలి గేట్ గంగప్రసాద్, మండల ఉపాధ్యక్షులు రెడ్డి రాంబాబు, భానోత్ రమేష్, మండల కోశాధికారి వెంకగౌడ్, కార్యదర్శి భీమా శంకర్, బీసీ సెల్ అధ్యక్షులు నరెడ్ల సాయిలు, ఎస్ టీ సెల్ అధ్యక్షులు శ్రీహరి, కిసాన్ సెల్ అధ్యక్షులు కిషన్, సొసైటీ డైరెక్టర్ గంగప్ప, మాజీ నీటి సంగం అధ్యక్షులు ముత్యాల కృష్ణ గారు,మాజీ సర్పంచ్ పీర్య నాయక్ మాజీ బీసీ సెల్ అధ్యక్షులు నారా గౌడ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఇమ్రాన్ యూత్ కార్యదర్శి దయానంద్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యలమంచిలి శ్రీనివాస్‌రావు

ఆశ్రమానికి వినయ్ రెడ్డి విరాళం

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణానికి చెందిన బిజెపి నియోజకవర్గ నాయకులు పొద్దుటూరి వినయ్ రెడ్డి, డొంకేశ్వర్ మండలం జి. జి. నడికుడ, శ్రీశ్రీశ్రీ పాండురంగ శివరామ ఆశ్రమానికి సుమారు 45వేల విలువైన టైల్స్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ కమిటీ నుండి ధన్యవాదాలు తెలిపి సన్మానించారు.

దళితబంధు పథకంలో ప్రాధాన్యత కల్పించాలి

నవతెలంగాణ - బోధన్
ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు పథకంలో మాలలకు ప్రాధాన్యత కల్పించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బోధన్ పట్టణంలోని రైస్ మిల్ భవన్‌లో నిర్వహించిన మాలమహానాడు కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడారు. మొదటి విడతలో మాలలకు దళిత బంధు పథకం అమలులో తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ బోధన్ డివిజన్ గౌరవ అధ్యక్షులు పరిమి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి అంజలి ఘటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అదేవిధంగా గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలో 25 కోట్లతో మాల భవన్ నిర్మించాలన్నారు .ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని, మాలలు మాదిగలు సమిష్టిగా పోరాడి హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.



బోధన్ : మాట్లాడుతున్న చెన్నయ్య

మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నీరడి రవి
మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నీరడి రవిని చెన్నయ్య ప్రకటించారు. బోధన్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.డివిజన్ అధ్యక్షులుగా శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మచ్చూరి దేవేందర్, ఉపాధ్యక్షులుగా కారం స్వామి, సహాయ కార్యదర్శిగా శ్యామ్, సోన్ కాంబ్లే రాహుల్, ప్రచార కార్యదర్శిగా అంతయ్య, కోశాధికారి బస్వంత్, సలహాదారులుగా పల్నాటి యాదగిరి, సాలెన్ సంజీవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు ఈశ్వర్, సింగడి పాండు, పట్టణ అధ్యక్షులు దాసు, పట్టణ ప్రధాన కార్యదర్శి తలారి నవీన్, గౌరవాధ్యక్షులు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అక్రమాలకు ఓట్ల రూపంలో సమాధానం



మాట్లాడుతున్న పైడి రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ - మాక్లూర్
ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అక్రమాలకు, అన్యాయాలకు ఓట్ల రూపంలో ప్రజలు బుద్ధి చెపుతారని ఆర్మూర్ బిజెపి నాయకుడు పైడి రాకేష్ రెడ్డి అన్నారు. అంతకుముందు హర్ ఘార్ తిరంగ కా ర్యాలీ తివర్ణ జెండాలతో 60ద్విచక్ర వాహనాలతో మాక్లూర్ గ్రామం నుంచి మాదాపూర్ పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అక్రమాలు అన్యాయాలకు అతి త్వరలో ఓట్ల రూపంలో సమాధానం చెప్పాలని, ప్రతి బీజేపీ కార్యకర్తకు ఎళ్ల వేళలా తోడు ఉంటానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలేపు రాజు, మాక్లూర్ మండల అధ్యక్షులు సురేష్ నాయక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, యువ మోర్చా ఐటి సెల్ అధ్యక్షుడు విపుల్ రావు, ఆర్మూర్ రూల్ మండల అధ్యక్షులు రోహిత్ రెడ్డి, ఓబీసీ మోర్చా అర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ గంగోని వినోద్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు జరిగింది

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ - వేల్పూర్
మండలంలోని రామన్నపేట్ గ్రామానికి చెందిన పల్లికొండ కిషన్ కూతురు ఇటీవలే మృతిచెందారు. విషయాన్ని తెలుసుకొని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాల్కొండ నియోజవర్గం నాయకుడు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడి ఆదివారం వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మాల్కన్న మోహన్, ఉపసర్పంచ్ బెల్దారి నవీన్, మండల అధ్యక్షుడు రమేష్, పోర్మల్ రాజేందర్, కృష్ణా రెడ్డి, పూజల సతీష్,గ్రామ కార్యకర్తలు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-బోధన్
బోధన్ మండల సర్వసభ్య సమావేశం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుద్దె సావిత్రి అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ వర్భన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్పిటిసి , మార్కెట్ కమిటీ చైర్మన్ ,సొసైటీ చైర్మన్ లు, మండల స్థాయి అధికారులు సమావేశానికి ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు.

ఎస్సైకి ఎంపికైన సుప్రియ రెడ్డిని ఆశీర్వదించిన పోలీసులు

నవతెలంగాణ - ముప్కాల్
బాల్కొండ మండలం వన్నెల్ 'బి' గ్రామానికి చెందిన మిట్టపల్లి సంతోష్ రెడ్డి-విజయ దంపతుల కూతురు మిట్టపల్లి సుప్రియ రెడ్డి సివిల్ ఎస్సైకి ఎంపిక అయింది. ఆదివారం బాల్కొండ పోలీసు స్టేషన్లో బాల్కొండ ఎస్సై గోపి సుప్రియ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఏఎస్సై శంకర్, పోలీసు సిబ్బంది, సుప్రియ రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..



సుప్రియను సన్మానిస్తున్న ఎస్ఐ